# అన్నదాతకు కష్టకాలం

- అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం
- తొలుత వరదలతో నీట మునిగిన పొలాలు
- ప్రస్తుతం ఎండలకు ఎండిపోతున్న ధైనం
- ప్రతికూల వాతావరణంతో ఆందోళన చెందుతున్న రైతన్నలు



కాకరాపల్లిలో నీరు లేక ఎండిపోతున్న వరిపొలం

**కోటనందూరు:** వాతావరణంలో నెలకొన్న అసమానతలు మెట్టప్రాంత రైతుల పాలిటశాపంగా మారాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరిపంట ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగి కొంతమేర దెబ్బతింది. వారం రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు మిగిలిన పంట ఎండిపోతోంది. ముంపు బారి నుంచి వరి పంటను రక్షించుకునేందుకు నానా పాట్లు పడ్డ అన్నదాత అదే పంట నీటి అవసరాలు తీర్చేందుకు ఇప్పుడు మల్లగుల్లాలు పడుతున్నాడు. 40 డిగ్రీలకు పైబడి కాస్తున్న ఎండలతో నెర్రలు తీసిన పంటపొలాలను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఇది చాలదన్నట్లు తీవ్ర ప్రతికూల పరిస్థితులతో పైరుపై కులుపు, తెగుళ్ల దాడి భారీగా పెరిగిపోయింది.

**40 వేల ఎకరాల్లో వరిసాగు**

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధిలోని కోటనందూరు, తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో సుమారుగా 40 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఆరుగాలం శ్రమించి వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన వరి పంట ఇప్పుడు ఎండిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరో వారం పాటు కొనసాగితే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తాండవలో తగ్గుతున్న నీటినిల్వలు**

ఇటీవల వరద ప్రభావంతో నిండుకుండలా మారిన తాండవ జలాశయంలో నీటినిల్వలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో సాగునీటి అవసరం పెరిగింది. రైతుల డిమాండ్ మేరకు కాలువలకు భారీ స్థాయిలో నీటిని విడుదల చేయాల్సిన అవసరం వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులో క్రమంగా నీటి నిల్వలు తగ్గుతున్నాయి. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 374.9 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. జలాశయం నుంచి ఎడమ ప్రధాన కాలువకు 300 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వేధిస్తున్న కలుపు, తెగుళ్లు**

కురిస్తే భారీ వర్షాలు, కాస్తే భారీ ఎండల నేపథ్యంలో వరిపైరును కలుపు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. భారీగా పెరిగిపోతున్న కలుపు తీయడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. వరిపంటను దోమ ఆశించి భారీగా నష్ట పరుస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

### పంటలు ఎండి పోతున్నాయి



వారం రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు వరిపొలాలు ఎండిపోతున్నాయి. తాండవనీరు శివారు ప్రాంతాలకు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పంట పొట్టదశకొచ్చే సమయం ఇది. చెరువులు, కాలువల్లో నీరు నిండుకుంది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా తాండవ నీటి విడుదల శాతాన్ని పెంచాలి.

– కరక అప్పలనాయుడు,
రైతు, కేఈ చిన్నయ్యపాలెం

### అవసరానికి అనుగుణంగా నీటి విడుదల



తాండవ జలాశయంలో భారీగా నీటి నిల్వలు ఉన్నాయి. ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా నీటి విడుదల శాతాన్ని మరింత పెంచి శివారు ప్రాంతాలకు కూడా నీరు అందించేందుకు కృషి చేస్తాం. సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి.

– అనురాధ, డీఈఈ, తాండవ ప్రాజెక్టు

## అరుణాచలక్షేత్రంలో ముద్రగడ పూజలు



రాచపల్లి అరుణాచలక్షేత్రంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న గిరిబాబు

**ప్రత్తిపాడు రూరల్:** రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి, అమ్మవార్లను శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఆయుఆరోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ఆలయ విశిష్టతను దేవస్థానం వ్యవస్థాపకులు స్వామి రామానంద ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి బులిరామకృష్ణ, పెంటకోట నాగబాబు, గౌతు స్వామి, కొప్పన గంగారావు, సారిపల్లి గంగరాజు, పెదిరెడ్డి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 50 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న పెన్షనర్లు

**ఏలేశ్వరం:** పట్టణంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మండల పెన్షనర్స్ కార్యాలయంలో రాజమహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి డాక్టర్ రత్నం 50 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఉడత రామచంద్రరావు మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలన్నారు. వచ్చే నెల 1న నిర్వహించే వృద్ధుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఇబ్రహీంఖాన్, ఆస్మాండ్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి

**కిర్లంపూడి:** అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని సోమవరం గ్రామంలో శనివారం ఆయన పర్యాటించారు. పలు కారణాలతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్న కుటుంబాలను పరామర్శించారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

### పౌష్టికాహారంపై అవగాహన



పెదశంకర్లపూడిలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్

**ప్రత్తిపాడు:** మండలంలోని పెదశంకర్లపూడిలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు అందించాల్సిన పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్నీడి నాగరత్నం, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు వరుపుల రామకృష్ణ, జువ్విన తిరుపతిరావు, కందా వీరాస్వామి, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్యలో హ్యాకథాన్

**గండేపల్లి:** మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్ 2025 కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విశాఖ సీఐఐ జోన్ చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు, ప్రో వైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### 25 మంది రక్త దానం

**ఏలేశ్వరం:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టెం వెంకటరమణ, పట్టణ శాఖ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

### ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మీకాంతం

**ప్రత్తిపాడు:** కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం హెచ్చరించారు. స్థానిక మినర్వా ఐటీ కళాశాలలో శనివారం ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ ప్రగతికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, రోడ్డు ప్రమాదాలు, అదృశ్య కేసులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు

**గండేపల్లి:** తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన శిష్ట వెంకటరమణమూర్తితో ఆలయ పండితులు విఘ్నేశ్వర పూజ, మహాన్యాస మంత్ర పఠనం, పంచామృతాభిషేకాలు, సప్తనదీ జలాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఏలేశ్వరంలో భారీ వర్షం



మల్లేపల్లిలో వర్షానికి తడుస్తూ బస్సు కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

**ఏలేశ్వరం:** పట్టణంలో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. వర్షానికి ప్రజలు ఉపశమనం పొందారు. సుమారు గంట పాటు పడిన వర్షానికి రహదారులు, పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపై వర్షపు నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**గండేపల్లి:** ఉచిత బస్సు మాట సరే.. బస్ షెల్టర్ల మాట ఏమిటని మహిళా ప్రయాణికులు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. బస్సు కోసం వేచి ఉండేందుకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వానలో తడుస్తూ రోడ్డుపై వేచి ఉండాల్సిందేనని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలోని మల్లేపల్లిలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. అప్పటికే రోడ్డుపై బస్సు కోసం వేచి ఉన్న మహిళా ప్రయాణికులు నీడ కోసం తడుచుకుంటూ సమీపంలో గల దుకాణాల వద్దకు చేరుకున్నారు. మరికొందరు గొడుగును రక్షణగా పట్టుకున్నారు. గంట పాటు ఏకదాటిగా కురిసిన వర్షానికి ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు.

# బాబు మాట ఇస్తే మోసం గ్యారంటీ

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



రాచపల్లిలో పార్టీ శ్రేణులతో వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

**ప్రత్తిపాడు రూరల్:** సీఎం చంద్రబాబు తన రాజకీయ జీవితంలో మాట ఇచ్చిన ప్రతిసారీ ప్రజలను మోసం చేశాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని రాచపల్లిలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా పెదిరెడ్డి నానిబాబును నియమించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి పాటు పడాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో గ్రామంలో రూ.1.50 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.1.50 కోట్ల వాటర్ ట్యాంకు, 14 జీఎల్‌ఆర్ వాటర్ ట్యాంకులు, 36 సీసీ రోడ్లు, 6 డ్రైనేజీలు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, పార్టీ నాయకులు బెహరా దొరబాబు, రామిశెట్టి బులిరామకృష్ణ, గౌతు స్వామి, పెంటకోట నాగబాబు, గుడాల వెంకటరత్నం, దోళే చిట్టిబాబు, శేరు కృష్ణ, బత్తుల నాగార్జున, గొల్లపల్లి దొరబాబు, కొండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న దస్తావేజు లేఖర్లు



తుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లేఖర్లు, స్టాంప్‌వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు

**తుని:** ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ విధానానికి నిరసనగా స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజుల లేఖరులు, స్టాంప్‌వెండర్లు శనివారం పెన్‌డౌన్ నిర్వహించారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ఓటీపీ విధానం వల్ల ప్రజలతో పాటు దస్తావేజుల లేఖరులు, స్టాంప్‌వెండర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. తొలుత స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు, దస్తావేజుల లేఖరులు కలిసి నూతన కమిటి ఎన్నిక జరిగింది.

**కొనసాగుతున్న దీక్షలు**

**ప్రత్తిపాడు:** స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు చేపట్టిన రిలే దీక్షలు రెండోరోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా లేఖర్ల సంఘ అధ్యక్షుడు పంచదార్ల నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు, చిలకమర్తి వెంకటరమణ, మదినే వెంకన్నదొర, ఇర్లంకి రాంబాబు, శింగిలిదేవి బాబ్జి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తే ప్రజుల ఇబ్బందులు పడతారన్నారు. సబ్ ప్లాన్ గ్రామాలకు సెల్ సిగ్నల్స్ ఉండవని, ఇక ఓటీపీ ఎలా వస్తుందని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ల విధానంలో నిబంధనలు సడలించి, ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాయవరపు హనుమంతరావు, రాంబాబు, వంగల సుందరి, లక్ష్మీరాయ్, తదితరులు పాల్గొన్నారు.

**నిలిచిపోయిన లావాదేవీలు**

దస్తావేజు లేఖర్లు చేపట్టిన రెండు రోజుల ఆందోళన వల్ల ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలు పూర్తిగానూ, కిర్లంపూడి మండలంలో ఏడు గ్రామాలు, శంఖవరం మండలంలోని వజ్రకూటం, రామన్నపాలెం, కత్తిపూడి, పిఠాపురం మండలంలోని వెల్దుర్తి, దొంతమూరు, గొల్లప్రోలు మండలంలోని కొడవలి, చెందుర్తి, వన్నెపూడి, చిన జగ్గంపేట గ్రామాల్లోని భూక్రయ విక్రయాలు, సెటిల్‌మెంట్లు, తనఖా రిజిస్ట్రేషన్లు వంటి ఆర్థిక లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సుమారు రూ.30 లక్షల ఆదాయం కోల్పోవలసి వచ్చిందని సబ్ రిజిస్ట్రార్ వి విక్టర్ డానియేల్ తెలిపారు.

# పోలీస్ సర్కిల్‌కు సీసీ కెమెరాల బహూకరణ



ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్‌కు సీసీ కెమెరాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

**ప్రత్తిపాడు/రౌతులపూడి:** మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా మణప్పురం ఫౌండేషన్ ద్వారా ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్‌కు 46 సీసీ కెమెరాలు బహూకరించినట్లు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ప్రత్తిపాడు సర్కిల్‌లోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రత, రక్షణ కోసం రూ.4.40 లక్షల విలువైన సీసీ కెమెరాలను శనివారం జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ చేతుల మీదుగా అందజేసినట్టు ఆయన చెప్పారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా అవసరం ఉన్న ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలను అమర్చి నేరాల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. మణప్పురం ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏబీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, అడిసనల్ ఎస్పీ జి.శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, మణప్పురం ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీ చైర్మన్‌కు సత్కారం



భాస్కరరావును సత్కరిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

**ప్రత్తిపాడు:** పదవులు బాధ్యతను పెంచుతాయని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు స్థానిక మునసబు గారి రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆలయ కమిటీ చైర్మన్ భాస్కరరావును ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న), పోతులూరు గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, యోగా గురువు తాతపూడి బుజ్జి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, మూరా గంగబాబు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమేవ జయతే

- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- గ్రామాల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు



తునిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

**రౌతులపూడి:** ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య సూచించారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి వెలుగు సిబ్బందితో కలసి పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఆరోగ్యవంతమైన వాతావరణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్యాధికారి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి భాస్కరబాబు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, జట్లా రాజా, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఏలేశ్వరం:** మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం విధిగా భావించాలన్నారు. అనంతరం సుమారు 200 మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు మదీనా, శ్రీలక్ష్మి, శివప్రసాద్, వీరభద్రరావు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి**

**గోకవరం:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్ సిబ్బందికి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. బస్టాండ్ ఆవరణతో పాటు మరుగుదొడ్లకు వెళ్లే మార్గంలో పూలకుండీలను ఏర్పాటు చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రయాణీకులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. డిపో సిబ్బంది పాల్గొన్నారు.

**తుని:** వృక్ష సంపదతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ చైర్మన్ నార్ల భవనరత్నాజీ, కమిషనర్ వెంకటరావు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు నాటి వృక్ష సంపద పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కుచర్లపాటి రూపాదేవి, వార్డు కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**హైవే డివైడర్‌పై మొక్కలు నాటిన సిబ్బంది**

**ప్రత్తిపాడు:** స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు జాతీయ రహదారి డివైడర్‌పై శనివారం ప్రత్తిపాడు ఎన్‌హెచ్ నిర్వహణ యార్డు సిబ్బంది మొక్కలు నాటారు. స్థానిక పుత్ర చెరువు జంక్షన్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ యార్డు మేనేజర్ మధుబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**కోటనందూరు:** పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయకూడదని నినాదాలు చేశారు. స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జయరాం తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి/కిర్లంపూడి/గోకవరం:** కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు అమోఘమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జెడ్.రాగంపేట సీహెచ్‌సీలో జగ్గంపేట మండలంలోని 102 మంది పారిశుద్ధ్య కార్మికులను శనివారం ఆయన శాలువా, పూలమాలలతో సన్మానించారు. తొలుత పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెడికల్, శానిటేషన్ కిట్లతో పాటు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. అలాగే కిర్లంపూడి, గోకవరం మండలాల్లోనూ పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.చంద్రశేఖర్, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రణీత్, నేతలు అడబాల వెంకటేశ్వరరావు, బుర్రి సత్తిబాబు, బస్వా చినబాబు, మండపాక అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

# ‘సశక్తి పరివార్’తో సంపూర్ణ ఆరోగ్యం

**రౌతులపూడి:** స్వస్థ నారీ–సశక్తి పరివార్ అభియాన్‌తో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీహెచ్‌సీ వైద్యాధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో శనివారం స్వస్థనారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సశక్తి పరివార్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని మహిళలకు గర్భాశయం, రొమ్ము క్యాన్సర్ పరీక్షలతో నిర్వహిస్తారన్నారు. మహిళలు, చిన్నారులు మెరుగైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిమ్మకట్టుపై గేట్లు ప్రారంభం



గేట్లను ప్రారంభిస్తున్న అధికారులు

**కోటనందూరు:** తాండవనదిపై ఉన్న నిమ్మకట్టు గ్రోయిన్‌కు ఏర్పాటు చేసిన గేట్లను తాండవ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కరక సత్యనారాయణ, డీఈఈ అనురాధ శనివారం ప్రారంభించారు. నిమ్మకట్టు గ్రోయిన్‌కు గేట్లు లేక నీరు వృథాగా పోతోందని, పంట అవసరానికి అనుగుణంగా నీటిని మళ్లించుకోలేకపోతున్నామని రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు తాండవ అధికారులు చర్యలు చేపట్టారు. గేట్ల ఏర్పాటుతో సాగునీటి సమస్య తలెత్తదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాండవ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మేడపురెడ్డి జోగిబాబు, జేఈఈ శ్యాం కుమార్, రైతులు పాల్గొన్నారు.